

హెచ్ఎం వైఖరితో విద్యార్థులకు అవస్థలు
- గేటు మూసివేయడంతో హైవేపై నడుచుకుంటూ పాఠశాలకు
- శివ్వంపేటలో ఘటన

7



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కార్మిక కోడ్‌లు రద్దు చేయాల్సిందే

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు
- సార్వత్రిక సమ్మెతో కదం తొక్కిన కార్మికులు

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను బుధవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ప్రశాంతంగా నిర్వహించారు. అన్ని వర్గాల కార్మికులు పాల్గొనగా ర్యాలీలు నిర్వహించి నినదించారు.

7

డీసీసీ కార్యవర్గంలో సామాజిక న్యాయం జరిగేలా చూడండి

- ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ నేతల సమావేశంలో మంత్రి పొన్నం

హైదరాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) కార్యవర్గం కూర్పులో సామాజిక న్యాయం జరిగేలా చూడాలని పార్టీ ఉమ్మడి మెదక్ జిల్లా నేతలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. యువతకు పెద్ద పీట వేయాలని, మహిళలకు అవకాశం కల్పించాలని సూచన చేశారు. డీసీసీ కార్యవర్గాల ఏర్పాటు కోసం ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జిలను నియమించిన టీపీసీసీ.. ఇందులో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఇన్‌చార్జిగా నియమించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన డీసీసీ అధ్యక్షులు, ముఖ్యనాయకులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు, పరిశీలకులు తదితరులతో బుధవారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో ఆ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ నెల 13 లోపు డీసీసీ ఆశావహుల జాబితాను రూపొందించే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈనెల 14న సిద్దిపేట, సంగారెడ్డి డీసీసీ కార్యవర్గం ఆశావహులతో ఇందిరాభవన్‌లో సమావేశం అవుతానని తెలిపారు.

నిర్లక్ష్యం వద్దు.. యాంటీ వైరస్ ఇంజెక్షన్ తప్పనిసరి

- కోతులు, కుక్కల దాడిలో ఒక్కరోజే 12 మందికి గాయాలు
- ప్రభుత్వ వైద్యుడు పవన్‌కుమార్

శివ్వంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కోతులు, కుక్కల దాడుల్లో గాయపడిన వారు నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రిలో యాంటీ వైరస్ ఇంజెక్షన్ చేయించుకోవాలని ప్రభుత్వ వైద్యుడు డా. పవన్‌కుమార్ తెలిపారు. ఒక్కరోజే మండల పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన 12 మంది కోతులు, కుక్కల దాడిలో గాయపడగా, శుక్రవారం వీరందరికీ పీహెచ్‌సీలో ఇంజెక్షన్లు చేసినట్లు వైద్య అధికారి పవన్‌కుమార్ వెల్లడించారు. ఏఆర్‌వీ (యాంటీ రేబిస్ వ్యాక్సిన్) ఇంజెక్షన్ చేయించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ఎక్కువ గాయాలైన వారిని హైదరాబాద్ ఆసుపత్రికి సిఫార్సు చేస్తున్నట్లు కూడా ఆయన తెలిపారు.

నిధులొచ్చాయి..

ఉమ్మడి జిల్లాలోని 46 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ. 9.22 కోట్లు మంజూరు

7

రాజీవ్ గృహకల్పతో సొంతింటి కలను నెరవేర్చుకుందామనుకున్న పేదలకు కలతే మిగిలింది. బంగారాన్ని కుదువ పెట్టి ఒకరు.. వడ్డీకి అప్పు చేసి మరొకరు.. పుస్తెలు అమ్మి ఇంకొకరు.. ఎంత కష్టమైన కిస్తీలు చెల్లించారు. 16 ఏళ్లవుతున్నా వారి సొంతింటి కల అందని ద్రాక్షగా మారడంతో ఆ పేదల కళ్లల్లో కన్నీళ్లు ఉబికివస్తున్నాయి. అద్దె ఇళ్లలో నెట్టుకొస్తూ, అప్పుల భారం పెరిగిపోతుంటే.. 'మా ఇళ్లు మాకివ్వండి' అంటూ లబ్ధిదారులు ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. తమ గోడును ఆలకించి, న్యాయం చేయాలని మొరపెట్టుకుంటున్నారు.



సంగారెడ్డిలో అసంపూర్తిగా ఉన్న రాజీవ్ గృహకల్ప ఇళ్లు

రాజీవ్ గృహకలత

నెరవేరని సొంతింటి కల.. 16 ఏళ్లుగా నిరీక్షణ

అప్పు చేసి డబ్బులు కట్టినా దక్కని గృహాలు
మా ఇళ్లు మాకివ్వాలని లబ్ధిదారుల మొర
సర్కార్ ముందుకు రావాలని వేడుకోలు

సంగారెడ్డి రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : సొంత ఇల్లు వస్తుందనే ఆశతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, బంగారం కుదువ పెట్టి, అప్పులు చేసి డబ్బులు కట్టిన రాజీవ్ గృహకల్ప లబ్ధిదారులు ఇప్పుడు నిస్సహాయంగా ఎదురుచూస్తున్నారు. 16 ఏళ్లు గడుస్తున్నా ఇళ్లు దక్కకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని, వెంటనే ఇళ్లు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.

432 ఇళ్లకు 182 మాత్రమే పూర్తి

పేదల సొంతింటి కలను నిజం చేయాలనే సంకల్పంతో 2009లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గృహకల్ప పథకం కింద సంగారెడ్డిలో రూ.5.32 కోట్లతో 432 ఇళ్లను నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. అయితే, లబ్ధిదారులకు ఈ ఇళ్లు అందకపోవడంతో వారి ఆశలు అడియాశలయ్యాయి. ఈ పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాతో పాటు లబ్ధిదారులు కూడా భాగస్వాములయ్యారు. ఒక్కో ఇంటికి రూ.1.54 లక్షలు ఖర్చవుతుండగా, కేంద్రం రూ.64వేలు, రాష్ట్రం రూ.41 వేలు చెల్లించాయి. మిగిలిన రూ. 49 వేలను లబ్ధిదారులు మూడు విడతలుగా (రూ.16వేలు, రూ.17వేలు, రూ.16 వేలు) చెల్లించారు. అర్హులైన లబ్ధిదారులు సకాలంలో డబ్బులు చెల్లించకపోతే పేర్లు తొలగిస్తామని అధికారులు హెచ్చరించడంతో, పేదలు తమకు మంజూరైన ఇల్లు పోతుందేమోనని భయపడ్డారు. కొందరు వడ్డీకి డబ్బులు తెచ్చి కడితే, మరికొందరు తమ వద్ద ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టి మరీ చెల్లించారు. ప్రభుత్వం చెప్పిన విధంగా అన్ని కిస్తులు ఎన్నో కష్టాలకోర్చి చెల్లించారు. అయితే, 432 ఇళ్లను నిర్మించాలని ప్రణాళికలు వేసినా, కేవలం 182 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. పూర్తయిన వాటిని కూడా కొద్దిమంది లబ్ధిదారులకు మాత్రమే అధికారులు కేటాయించారని మిగిలిన వారు వాపోతున్నారు. నాటి నుంచి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నామని చెబుతున్నారు. ఆ తర్వాత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో రాజీవ్ గృహకల్ప నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

ఆశగా ఎదురుచూపులు

సొంతింటి కల నిజమవుతుందని

మిగతా 8వ పేజీలో

పుస్తెలమ్మి డబ్బు కట్టాను



సొంత ఇళ్లు వస్తుంది కదా అని డబ్బులు లేకపోతే నా పుస్తెలు అమ్మి కట్టాను. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఇంకా ఇవ్వలేదు. అప్పటి నుంచి అధికారుల చుట్టు తిరుగుతూనే ఉన్నాం. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది కదా ఇప్పుడైనా ఇవ్వాలి.

- మంగళబాయి, సంగారెడ్డి

కిరాయి కట్టలేకపోతున్నాం



కిరాయి ఇంట్లో ఉంటూ అద్దె కట్టే బాధ పోతుందనుకుని అప్పు చేసి కిస్తీలు కట్టాను. ఇళ్లు ఇవ్వకపోవడంతో మాకు కిరాయి కట్టే బాధ తప్పడం లేదు. మాకు ఇళ్లు ఇప్పించి ఆదుకోవాలి.

- బాల్‌రాజ్, సంగారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలి



మాకు సొంతిళ్లు వస్తుందని ఎంత కష్టమైనా డబ్బులు కట్టాం. ఇళ్లు ఇవ్వకపోవడంతో అద్దె ఇంట్లోనే ఉంటూ కిరాయి కట్టలేకపోతున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వమే ఆదుకోవాలి. ఆ ఇళ్లను పూర్తి చేసి, ఇయ్యాలి.

- దుర్గమ్మ, సంగారెడ్డి



రాజీవ్ గృహకల్ప ఇళ్ల వద్ద పత్రాలతో లబ్ధిదారులు

సమగ్ర విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- నిమ్జ్ భూసేకరణ వేగవంతంచేయాలి
- సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

జహీరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు సమగ్ర విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలో నిమ్జ్ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. భూసేకరణ, పరిహారం చెల్లింపుపై సమీక్షించారు. అనంతరం హోతి(కె) గ్రామంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. ఆ తర్వాత గోవిందాపూర్ గ్రామంలో రైతు నాగిశెట్టి రాథోడ్ వ్యవసాయ పొలంలో ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆసక్తిని పెంచేందుకు ఉపాధ్యాయులు కొత్త బోధన పద్ధతులను పాటించాలని సూచించారు. పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించాలని, మెనూ పాటించాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. నిమ్జ్ అధికారులతో సమీక్షా సమావేశంలో ఫేజ్-1లో మొత్తం 3,240 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, 2,888 ఎకరాలు మాత్రమే సేకరించడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో నిమ్జ్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రాజు, ఆర్డీవో రాంరెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సోమశేఖర్, తహసీల్దార్ దశరథ్, ఉద్యానవన శాఖ అధికారి పండరి, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సంగారెడ్డికలెక్టర్ ప్రావీణ్య

సీజనల్ వ్యాధులపై ఇంటింటి జ్వర సర్వే

- ఏఎన్ఎం, ఆశాల ఆధ్వర్యంలో అవగాహన

సంగారెడ్డి అర్బన్, జూలై 9(ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల కట్టడికి ఉన్నతాధికారుల ఆదేశాలతో సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇంటింటి జ్వర సర్వేను ప్రారంభించింది. సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్తూ కుటుంబ సభ్యుల సంఖ్యను, ఎవరైనా జ్వరాల బారిన పడ్డారా అని ఆరా తీస్తున్నారు. జ్వరం లేదా ఇతర లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. పాత టైర్లు, కొబ్బరి బోండాలు, కూలర్లు, నీటి తొట్టిల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయిస్తున్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డేను పాటించాలని ప్రజలకు సూచిస్తున్నారు. ఇప్పటివరకు సంగారెడ్డి జిల్లాలో తొమ్మిది డెంగీ కేసులు, 135 టైఫాయిడ్ కేసులు నమోదైనట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు.



చింతల్‌పల్లిలో సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది

రసీదు వెయ్యికి.. వసూలు లక్షల్లో

తెల్లాపూర్ మున్సిపాలిటీలో ట్రేడ్ లైసెన్స్ దందా
వందల వాణిజ్య సముదాయాలకు అక్రమ అనుమతులు!
డిజిటల్ సంతకం లేని వారికి నోటీసులు
బయటపడుతున్న అవినీతి బాగోతం

హైదరాబాద్ మహానగరాన్ని ఆనుకుని ఉన్న తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో అక్రమాలకు అంతులేకుండా పోయింది. కొత్త కాలనీలు, వాణిజ్య భవనాల నిర్మాణాలు భారీగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, దుకాణాల సముదాయాలకు అనుమతులు ఇచ్చే పేరుతో అధికారులు లక్షల్లో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. ట్రేడ్ లైసెన్స్ ప్రాథమిక రుసుము రూ.వెయ్యి ఉండగా, దీనిని అడ్డుపెట్టుకొని అక్రమార్కులు లక్షల్లో దండుకున్నారు. దీంతో మున్సిపాలిటీకి రూ.కోటికిపై నష్టం వాటిల్లిందని అంచనా. ఈ అక్రమ అనుమతులపై ఫిర్యాదులు రావడంతో అధికారులు విచారణకు దిగారు.



తెల్లాపూర్ రేడియల్ రోడ్డు పక్కన వెలిసిన వాణిజ్యసముదాయాలు

రామచంద్రాపురం టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రేడియల్, డబుల్ రోడ్లు, అవుటర్ రింగ్ రోడ్డు, సింగిల్ రోడ్లు ఉన్నాయి. ఈ రోడ్లను బట్టి ట్రేడ్ లైసెన్స్ ఫీజులు మారతాయి. కానీ, అన్నిటికీ రూ.వెయ్యి ప్రాథమిక రసీదులు ఇచ్చి, మిగిలిన మొత్తాన్ని అక్రమంగా వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల ఒక బిల్డర్, తన వాణిజ్య కార్యాలయ నిర్మాణానికి రూ.వెయ్యి రశీదు తీసుకుని, తరువాత రెండు లక్షలు చెల్లించాల్సి వచ్చిందని, అయితే, ఆ అధికారి బదిలీ కావడంతో డబ్బులు వెనక్కి రాని పరిస్థితి ఏర్పడిందని సమాచారం. మరొక బిల్డర్ మాత్రం లంచం ఇవ్వకుండానే, నిబంధనల ప్రకారం రూ.4.5 లక్షల ఫీజు చెల్లించారు. అంటే, మిగిలిన చోట్ల ప్రభుత్వానికి రావాల్సిన లక్షల రూపాయలు అవినీతి రూపంలో పక్కదారి పట్టినట్లు స్పష్టమవుతోంది.

వెయ్యికిపైగా అక్రమ లైసెన్స్‌ల జారీ

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్, కొల్లూరు, ఈదులనాగులపల్లి, వెలిమెల, పాటి, ఘన్‌పూర్, ముత్తంగి, పోచారం, కర్దనూరు గ్రామాల్లో వెయ్యికిపైగా ప్రాథమిక ట్రేడ్ లైసెన్స్‌లు అక్రమంగా జారీ అయ్యాయని అధికారులు ప్రాథమిక విచారణలో

మిగతా 8వ పేజీలో

కానరాలేదా.. కరిగిపోయారా

8 మంది కార్మికుల ఆచూకీ ప్రశ్నార్థకమేనన్న అధికారులు
సిగాచి పరిశ్రమ ప్రమాదానికి 11 రోజులు
రెస్క్యూ బృందాల తనిఖీల్లోనూ నిష్ఫలితం
గల్లంతైన వారి కుటుంబాలకు రూ.15లక్షల చొప్పున పరిహారం అందజేత

7



చెక్కును చూపిస్తున్న వ్యక్తి

ఆలయాభివృద్ధికి కృషి



ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

పుల్‌కల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వెంకటకిష్టాపూర్ గ్రామంలో వెలసిన అతి పురాతన శ్రీరుక్మిణీ పాండురంగ స్వామి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీ ఇచ్చారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం తన కూతురు త్రిష, అల్లుడు మణికంఠతో కలిసి ఆయన స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రశాంతంగా ఎప్‌సెట్ కౌన్సెలింగ్

● ఎనిమిది రోజుల్లో 3800 మంది విద్యార్థులు

సంగారెడ్డి రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): 2025 విద్యాసంవత్సరానికి గాను నిర్వహించిన ఎప్‌సెట్ టీజీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సంగారెడ్డి మండలం హనుమాననగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 1వ తేది నుంచి 8వ తేది వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌ను ఎనిమిది రోజుల పాటు రోజుకు 480 మంది విద్యార్థుల చొప్పున నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జానకీదేవి తెలిపారు. ఎనిమిది రోజుల్లో మొత్తం 3800 మంది విద్యార్థుల ఎస్ఎస్‌సీ, ఇంటర్ మెమో, ఆధార్‌కార్డు, తదితర ధృవపత్రాలను పరిశీలించి కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. ఈ కౌన్సెలింగ్‌లలో కళాశాల సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్ శక్తి కిరణ్, అధ్యాపకుడు శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్ , టిప్పర్‌లు స్వాధీనం



జోగిపేట పోలిస్ స్టేషన్‌లో టిప్పర్, ఎక్స్‌కవేటర్ వాహనాలు

జోగిపేట రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జోగిపేట పరిసర ప్రాంతాల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కవేటర్ , టిప్పర్‌లు బుధవారం పోలీస్ స్టేషన్‌లో దర్శనమిచ్చాయి. కొన్ని రోజులుగా అందోల్ మండల పరిధిలో విచ్చలవిడిగా కొంత మంది మట్టి దందాను కొనసాగిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కవేటర్ , టిప్పర్ వాహనాలను పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచడం గమనార్హం.

మనస్తాపంతో వృద్ధుడు ఆత్మహత్యాయత్నం

శివ్వంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా భూమి పొతీ చేసేందుకు ఆడపడుచులు రాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ వృద్ధుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన బుధవారం అల్లిపూర్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని అల్లిపూర్ గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు తన తల్లిదండ్రులు మృతి చెందడంతో వారి పేరు మీద ఉన్న 26 గుట్టల భూమిని ముగ్గురు అన్నదమ్ములు పొతీ చేసుకునేందుకు రెండు సంవత్సరాలుగా ఆడపడుచులను రమ్మని కోరుతున్నారు. వారు ఎంతకు రాకపోవడంతో శుక్రవారం వృద్ధుడు గ్రామస్థులను తీసుకొని ఆడపడుచుల ఊరికి వెళ్లి పొతీ చేయించమని చెప్పించినా వారు నిరాకరించారు. దీంతో మనోవేదనకు గురైన వృద్ధుడు తిరుగు ప్రయాణంలో గ్రామస్థులకు తెలియకుండా ఇటుకబట్టీల సమీపంలోకి వెళ్లి తమ్ముడికి ఫోన్ చేసి నేను బతకను అని చెప్పి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఘటనాస్థలానికి వెళ్లిన కుటుంబీకులు, గ్రామస్థులు వృద్ధుడిని ఆసుపత్రికి తరలించారు. వృద్ధుడి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు.

తోడికోడళ్లు అదృశ్యం

రామాయంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట పట్టణానికి చెందిన తోడికోడళ్లు అదృశ్యమయ్యారు. ఇంట్లో చిన్నపాటి గొడవల కారణంగా ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు బుధవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు అందింది. వివరాల్లోకి వెళ్తే.. రెడ్డి కాలనీకి చెందిన అక్కలు, హనుమాన్, తన సోదరుడు రోజూలాగే భోజనం చేసి నిద్రించారు. తెల్లవారు జామున లేచేసరికి హనుమాన్ భార్య, మరదలు (తోడికోడళ్ళు) మౌనిక, అరుణ ఇంట్లో కనిపించలేదు. వారి ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా లాభం లేదు. దీంతో హనుమాన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలరాజ్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

మునిపల్లి, జులై 9 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం తాటిపల్లి గ్రామంలో జరిగింది. ఎస్సై రాజేష్ నాయక్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని తాటిపల్లి గ్రామానికి చెందిన గోల్ల విజయ్ కుమార్(19) అనే యువకుడు సదాశివపేట మండలంలోని ఎంఆర్ఎప్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 7న (సోమవారం) ఉదయం పొలానికి వెళ్లిన విజయ్ కుమార్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులకు అనుమానం వచ్చి వెళ్లి చూడగా అప్పటికే విజయ్ కుమార్ పురుగుల మందుతాగి పడిపోయి ఉన్నాడు. బాధితుడిని 108 వాహనంలో సదాశివపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి నుంచి గాంధీ అసుపత్రికి ఈ నెల 8న తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు కనకరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు.

మనోవేదనతో యువకుడు..

నాగల్‌గిద్ద, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకుని చనిపోయాడు. ఈ సంఘటన బుధవారం నాగల్‌గిద్ద మండలం కిషన్ నాయక్ తండాలో జరిగింది. నాగల్‌గిద్ద ఎస్సై జి.సాయిలు తెలిపిన వివరాల ప్రకారం... కిషన్ నాయక్ తండాకు చెందిన రాథోడ్ ప్రకాష్ (36) మద్యానికి బానిసై ఫైల్స్ వ్యాధితో కొన్ని రోజులుగా బాధపడుతూ మందులు వాడుతున్నాడు. ఈవిషయమై అతడు మనోవేదనకు గురై బాధలు భరించలేక బుధవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రకాష్ భార్య పార్వతిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

మనోహరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం మండల పరిధిలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే పోలీసు పండారి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన డప్పు ప్రవీణ్‌కుమార్(25) తండ్రి రెండు నెలల కితం చనిపోయాడు. దీంతో ప్రవీణ్‌కుమార్ ఎలాంటి పని చేయకుండా జులాయిగా తిరిగేవాడు. దీంతో మద్యానికి బానిసై, అప్పులు చేయడంతో వాటిని తీర్చలేక గ్రామ శివారులోని రైల్వే ట్రాక్‌పై పడుకోవడంతో రైలు ఢీకొని చనిపోయాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్లే వారు చూసి పోలీసులకు సమాచారం అందించగా, సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కానరాలేదా.. కరిగిపోయారా

- ఎనిమిది మంది కార్మికుల ఆచూకీ ప్రశ్నార్థకమేనన్న అధికారులు
- సిగాచి పరిశ్రమ ప్రమాదానికి 11 రోజులు
- రెస్క్యూ బృందాల తనిఖీల్లోనూ నిష్ఫలితం
- గల్లంతైనవారి కుటుంబాలకు రూ.15లక్షల చొప్పున పరిహారం అందజేత
- మిగతా పరిహారంపై 3 నెలల తర్వాతే నిర్ణయం
- గాలింపు చర్యలు కొనసాగుతాయని ప్రకటన



సిగాచి రియాక్టర్ పేలుడు ప్రమాదంలో గల్లంతయిన కార్మికులు

సంగారెడ్డి ప్రతినిధి, ఆంధ్రజ్యోతి, జూలై 9: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో పేలుడు సంభవించి నేటికి 11 రోజులు. ప్రమాదంలో అక్కడికక్కడే 36 మంది చనిపోయినట్లుగా అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మరో 8 మంది మృతిచెందారు. మొత్తం మృతుల సంఖ్య 44కు చేరింది. ఇక ప్రమాదం జరిగిన రోజు నుంచి 8మంది ఆచూకీ లభించడం లేదు. వీరి ఆచూకీ కోసం ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక, పోలీసు బృందాలు పదిరోజుల పాటు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించినా ఫలితం లేకపోయింది. ఇంకా వెతుకుతూనే ఉన్నారు. 44 మంది చనిపోగా వీరిలో దాదాపు 30 మృతదేహాలను కనుగొనడం వైద్యులు, ఫోరెన్సిక్ బృందాలకు కష్టతరమైంది. పూర్తిగా కాలిపోయిన మృతదేహాలను వారి కుటుంబ సభ్యులు కూడా గుర్తుపట్టలేదు. అందుకే డీఎన్ఏ పరీక్షలతో నిగ్గు తేల్చారు. చనిపోయిన వారి కుటుంబసభ్యుల రక్తం శాంపిల్స్ సేకరించి మృతదేహాల డీఎన్ఏతో పోల్చి వారం రోజుల్లోనే ఏ మృతదేహం ఎవరిదో అప్పగించారు. గడిచిన మూడు రోజుల్లో ప్రమాదం జరిగిన స్థలంలో దాదాపు 70 మాంసపు ముక్కలు, ఎముకలు, దంతాలను ఫోరెన్సిక్ నిపుణులు గుర్తించారు. ఈ అవశేషాల్లో కూడా గల్లంతైన 8మంది ఆచూకీ కానరాకపోవడం గమనార్హం. లభ్యమైన మాంసపు అవశేషాలు సైతం గతంలో గుర్తించిన మృతులవేనని తేల్చారు. మరో మూడు ముక్కలు మాత్రమే మిగిలాయని డీఎన్ఏ పరీక్షలకు పంపించినట్లుగా అధికారులు చెబుతున్నారు.



గల్లంతైనవారి కుటుంబసభ్యులతో చర్చిస్తున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

బూడిద కూడా గల్లంతే..

సాధారణంగా బూడిదలో కూడా డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతదేహాల ఆనవాళ్లను గుర్తించే అవకాశం ఉంటుంది. అందుకే డ్రయర్ పేలిన పరిసరాలతోపాటు పరిశ్రమలోని అడుగడుగునా బూడిదను సైతం సేకరించారు. గల్లంతైన వారి ఆచూకీ కనిపెట్టడానికి ఏ అవశేషాన్ని కూడా వదల్లేదు. చివరకు బూడిదలోనూ వారి ఆచూకీ లభించలేదు. తుదకు భూమిని సైతం తవ్వి మృతదేహాల ఆనవాళ్ల సేకరించినా అందులోనూ నిరాశ తప్పలేదు. అయితే డ్రయర్ పేలిన సమయంలో ఆ ఉష్ణోగ్రతకు కార్మికులు పూర్తిగా కరిగిపోవచ్చనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రసాయనాల విస్ఫోటనం పెద్ద ఎత్తున సంభవించడంతో ఎముకలు, మాంసం కరిగిపోయి నీరుగారే అవకాశం ఉందని అంటున్నారు.

ఒక్కొక్కరికీ రూ.15లక్షలు..

గల్లంతైన 8మంది కార్మికుల కుటుంబసభ్యులకు ఒక్కొక్కరికీ రూ.15 లక్షల చొప్పున చెక్కుల అందజేశారు. పాశమైలారంలోని ఐలా భవన్‌లో వసతి పొందుతున్న ఆ కుటుంబాలతో సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ చర్చించారు. ఆచూకీ లభ్యం కానందున ప్రస్తుతానికి తక్షణ పరిహారంగా అందజేస్తున్నామని, మరో 3నెలల వరకు మిగితా పరిహారం గురించి ఒక నిర్ణయానికి వస్తామని చెప్పుకొచ్చినట్లు తెలిసింది. మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం ఇప్పిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో మిగితా సహాయం కోసం బాధితులు ప్రశ్నించారు.

చనిపోయారని చెప్పినా చిక్కులే..

గల్లంతైనవారు చనిపోయారని చెప్పినా చిక్కులు తప్పవని అధికారులు భావిస్తున్నారు. అందుకే ఆచితూచి వ్యవహరిస్తున్నారు. రూ.కోటి పరిహారం ఇవ్వాలంటే వారి డెత్ సర్టిఫికెట్లు ఉండాలి. లేదంటే ఏడేళ్ల వరకు ఆచూకీ తేలకుంటే అప్పుడు చనిపోయినట్లుగా ధ్రువీకరించాలనే నిబంధన ఉంది. పైగా ప్రమాదంలో ఎలాంటి ఆనవాళ్ల లభ్యం కావడం లేదు. దీంతో అధికారులకు చట్టపరమైన చిక్కులు వచ్చిపడ్డాయి. ప్రమాద విషయంతోపాటు గల్లంతైనవారి కుటుంబసభ్యుల పరిస్థితిని మానవతా కోణంలో ఆలోచించాలని భావిస్తున్నారు. ప్రత్యేక కేసుగా పరిగణించి త్వరితగతిన ఓ నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట కల్చరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 2025 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, టీజీఎంఎస్, కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు జూలై 13 లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసిన అప్లికేషన్, ధ్రువపత్రాలను జూలై 15లోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. జిల్లాలోని ఆసక్తి గల అధ్యాపకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉచితంగా అరుదైన గుండె ఆపరేషన్



రోగికి అరుదైన శస్త్ర చికిత్స చేసిన వైద్యులు

ములుగు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆసుపత్రి, మెడికల్ కళాశాలలో బుధవారం నిష్ణాతులైన వైద్య బృందం ఒక నిరుపేద రోగికి అరుదైన అయోటిక్ శస్త్రచికిత్సను ఉచితంగా విజయవంతంగా నిర్వహించింది. మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండలం, పోగులపల్లి గ్రామానికి చెందిన 52 ఏళ్ల బోనగిరి యాకయ్యకు చిన్నపేగు, కిడ్నీలు, రెండు కాళ్లకు గుండె నుంచి రక్తాన్ని తీసుకెళ్లే రక్తనాళాలు బిగుసుకుపోయి రక్త ప్రసరణ ఆగిపోయింది. ఆయన వివిధ ప్రాంతాల్లోని ప్రముఖ ఆసుపత్రులు, వైద్యులను సంప్రదించినా ఫలితం లేకపోయింది. చివరికి ఆర్వీఎం ఆసుపత్రి వైద్యులను ఆశ్రయించారు. వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించి అత్యాధునిక చికిత్సను అందించింది. పది గంటల పాటు శ్రమించి అయోటిక్ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ శస్త్రచికిత్సలో ప్రముఖ వైద్యులు డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ భరద్వాజ్, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ విజయ్ మోహన్, డాక్టర్ కిషోర్ల బృందం పాలుపంచుకుంది.

జేఎన్టీయూ ప్రతిష్ఠను దిగజార్చవద్దు

● ప్రిన్సిపాల్ నరసింహ



మాట్లాడుతున్న జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ, అధ్యాపకులు

పుల్కల్, జూలై (ఆంధ్రజ్యోతి): నిరాధారమైన ప్రచారం చేస్తూ సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రతిష్ఠను దిగజార్చవద్దని ప్రిన్సిపాల్ జి. నరసింహ కోరారు. బుధవారం తన ఛాంబర్‌లో వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కళాశాలలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. కళాశాలపై, తనపై అవాస్తవ ఆరోపణలు సరికాదన్నారు. 160 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ కళాశాలకు మంచి పేరు ఉందని, విద్యార్థులకు మంచి ప్లేస్‌మెంట్స్ లభిస్తున్నాయని పేర్కొన్నారు. కళాశాలలో అసాంఘిక కార్యకలాపాలపై విచారణ జరపాలని కోరడం విచారకరమని అన్నారు. కళాశాలలో అధ్యాపకులు ఎవరినీ వేధించడం లేదని, కొందరు ఉద్దేశపూర్వకంగానే రహస్యంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత నాలుగు బ్రాంచ్‌ల నుంచి 12 కోర్సులకు పెంచినట్లు చెప్పారు. కళాశాలలో కాలుష్య నియంత్రణ కోసం మంత్రి దామోదర రాజనరసింహ సహకారంతో విద్యార్థులకు 100 సైకిళ్లను అందజేశామని తెలిపారు. కళాశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఆయా విభాగాల హెచ్‌వోడీలు రజనీష్, జోషిశ్రీపాద్, ప్రసన్నలక్ష్మి, బేబీశాలిని తదితరులు పాల్గొన్నారు.

గురు పౌర్ణమికి సాయిబాబా ఆలయం ముస్తాబు



ఖేడ్‌లోని సాయిబాబా ఆలయం, సాయినాథుడు

నారాయణఖేడ్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నేటి గురు పౌర్ణమి ఉత్సవాలకు నారాయణఖేడ్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయం ముస్తాబైంది. ప్రతి సంవత్సరం గురు పౌర్ణమి (వ్యాస పౌర్ణమి)ని పురస్కరించుకుని ఆలయంలో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తారు. గురువారం ఉదయం 5 గంటలకు కాకడ హారతి, 7 గంటల నుంచి భక్తులచే స్వయం అభిషేకాలు, 8 గంటలకు అలంకరణ, ఉదయం 10 గంటల నుంచి విష్ణు లలిత సహస్రనామ పారాయణాలు, కుంకుమార్చన, పుష్పార్చన, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, 56 రకాలతో భక్తులు తయారు చేసిన ప్రసాదాలను సమర్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు మహనీయులచే ప్రవచనాలు, హారతి, ప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు పల్లకీ సేవ కార్యక్రమాలు ఉంటాయని కమిటీ బాధ్యులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే పంచగామలోని పంచలింగేశ్వర ఆలయం ఆవరణలో గురు పౌర్ణమి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ పీఠాధిపతి కాశీనాథ్ బాబా తెలిపారు. అలాగే, ఖేడ్ మండలం కొండాపూర్ శివార్ సందు తండాలోని దక్షిణ కాళికామాత ఆలయంలో గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ పీఠాధిపతి జగదీశ్వరానంద్ మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



సిద్దిపేట : సార్వత్రిక సమ్మెలో భాగంగా కార్మిక సంఘాల ర్యాలీ

కార్మిక కోడ్‌లు రద్దు చేయాల్సిందే

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు
- ఉమ్మడి జిల్లాలో సార్వత్రిక సమ్మె నిరసనలు

సంగారెడ్డి రూరల్/సిద్దిపేట అర్బన్/మెదక్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గానికి నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందేనని, అప్పటివరకు పోరాటం ఆపేదిలేదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు బుధవారం పిలుపునిచ్చిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. పటాన్‌చెరు, జిన్నారం, ఐడీఏ బొల్లారం, హత్నూర తదితర చోట్ల పరిశ్రమల్లో కార్మికులు భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా కేంద్రాలైన సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్‌లలో కార్మికులు భారీ ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. సంగారెడ్డిలో ప్రభుత్వ ఐటీఐ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం, కలెక్టరేట్ కార్యాలయం ముందు జరిగిన ధర్నానుద్దేశించి చుక్క రాములు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చేలా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. వీటిని రద్దు చేసే వరకు పోరాడుతామన్నారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను తొలగించి, నాలుగు లేబర్ కోడ్‌లను తేవడం ద్వారా కార్మికుల పొట్ట కొడుతున్నారని ధ్వజమెత్తారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు.



మెదక్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



సంగారెడ్డిలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

సమ్మెకు మద్దతుగా ఎల్ఐసీ ఉద్యోగులు, సిబ్బంది కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

● సిద్దిపేటలో కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చర్చి గ్రౌండ్ నుంచి విక్టరీ టాకీస్ మీదుగా పాత బస్టాండ్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ ఉమ్మడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన రావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కృష్ణపురం లక్ష్మణ్, బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి మంచే నరసింహులు మాట్లాడుతూ కేంద్రం కార్మిక వర్గ ద్రోహి అని మండిపడ్డారు. ఈ సమ్మెకు సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు సత్తయ్య మద్దతు తెలిపారు.

● మెదక్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి రాందాస్ చౌరస్తా వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్మిక నాయకురాలు నర్సమ్మ మాట్లాడుతూ కేంద్రం కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలకు పాల్పడుతుందన్నారు. లేబర్ కోడ్‌లను తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో సీఐటీయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు, సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, మెదక్ జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్, నాయకులు, అంగన్‌వాడీ ఆశా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

'సిగాచి' పరిహారం ఎగ్గొట్టేందుకు ప్రభుత్వం కుట్రలు

● కార్మికులకు అన్యాయం చేస్తే ఊరుకోం : బీఆర్ఎస్

పటాన్‌చెరు రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సిగాచి మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఎగ్గొట్టేందుకు సర్కార్ కుట్రలు చేస్తుందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీకాంత్ గౌడ్, ఆదర్శ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం పాశమైలారం ఐలా ప్రాంగణంలో ఇంతవరకు మృతదేహాలు లభించని ఎనిమిది మంది కుటుంబ సభ్యులకు అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా రూ.15 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న శ్రీకాంత్ గౌడ్, ఆదర్శ్‌రెడ్డిలు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు రూ.కోటి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పిందన్నారు. కేవలం రూ.15లక్షలు ఇచ్చి వదిలించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. మృతదేహాలు లభించని పక్షంలో డెత్ సర్టిఫికెట్ కోసం ఏడు సంవత్సరాలు పడుతుందని చెప్పడం వెనుక పెద్ద కుట్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు లోపల కూర్చుని అధికారులతో కుమ్మక్కై పరిశ్రమకు అనుకూలంగా పావులు కదుపుతున్నారని, దీన్ని బీఆర్ఎస్ నాయకత్వం చూస్తూ ఊరుకోదని అన్నారు. హరీశ్ రావు ఆదేశాలతో తాము ఇక్కడికి వచ్చామని, కార్మికుల కుటుంబాలకు అన్యాయం జరిగితే అవసరమైతే హరీశ్‌రావు కూడా ఇక్కడికి వచ్చి ధర్నా చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పరిశ్రమ యాజమాన్యం కూడా మృతుల సంఖ్యను తక్కువ చేసి చూపిస్తోందని ఆరోపించారు. 60 మంది కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ సదుపాయం కూడా లేకుండా పనిచేయించుకున్నారన్నారు. రాజకీయాలకు తావు లేకుండా మృతుల కుటుంబాలకు న్యాయం జరగాలన్నదే తమ తపన అన్నారు. ఈ సందర్భంగా వారు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి భరోసా ఇచ్చారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

● తల్లులకు కుట్టు మిషన్ శిక్షణ

సిద్దిపేట అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లుల కోసం ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి భాస్కర్ మాట్లాడుతూ, ఉచిత కుట్టు మిషన్ శిక్షణతో విద్యార్థుల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని, కంటి పరీక్షల ద్వారా విద్యార్థుల ఆరోగ్య సమస్యలు కూడా పరిష్కారమవుతాయని అన్నారు. ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కలవేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఉచిత శిక్షణ, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజు ప్రభాకర్ రెడ్డి, వీవో అధ్యక్షురాలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ



విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాం అందజేస్తున్న దాతలు

మర్కుక్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేట్ అండ్ ఎన్రిచ్ ఫౌండేషన్ సౌజన్యంతో మర్కుక్ మండలంలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న 241 మంది విద్యార్థులకు రెండు జతల క్రీడా దుస్తులు (స్పోర్ట్స్ యూనిఫాం) అందజేశారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకిషన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతీక్ షీలా, ఆయన తల్లిదండ్రులు డా. రమేష్ షీలా, డా. సుచీదారా, కోఆర్డినేటర్ మధు షీలా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులోనూ ఈ పాఠశాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని ప్రకటించారు.

హెచ్ఎం వైఖరితో విద్యార్థులకు అవస్థలు

● గేటు మూసివేయడంతో హైవేపై నడుచుకుంటూ పాఠశాలకు



హాస్టల్ ముందు గేటుకు తాళం వేయడంతో హైవే పై నుంచి పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

శివ్వంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శివ్వంపేట మండల కేంద్రంలోని గిరిజన బాలికల వసతి గృహం చెందిన 200 మంది విద్యార్థులు గత పది రోజులుగా ప్రధానోపాధ్యాయుడి వైఖరి కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ ముందు నుంచి పాఠశాలలోకి వెళ్లే గేటుకు హెచ్ఎం తాళం వేయడంతో, విద్యార్థులు జాతీయ రహదారిపై చుట్టూ తిరుగుతూ నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లాల్సి వస్తుందని బుధవారం విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ సిబ్బంది విద్యార్థులను వరుస క్రమంలో జాతీయ రహదారిపై నుంచి పాఠశాలకు తీసుకువెళ్తున్నారు. ప్రధానోపాధ్యాయుని ఈ వైఖరితో పలు గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు రోడ్డుపైన పాఠశాలకు వెళ్లే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్ ముందు ఉన్న గేటును తెరిపించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై గిరిజన వసతి గృహం వార్డెన్ యాదయ్యను సంప్రదించగా గేటు తెరవకపోవడంతోనే విద్యార్థులు రోడ్డుపై నుంచి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుందని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.



నిధులొచ్చాయి

ఉమ్మడి జిల్లాలోని 46 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ. 9.22 కోట్లు మంజూరు

జగదేవ్‌పూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మహర్దశ వచ్చింది. నిధులు లేక మౌలిక వసతులకు నోచుకోక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, మౌలిక సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని మొత్తం 46 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ.9.22కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిద్దిపేట జిల్లాలోని 15 జూనియర్ కళాశాలలకు రూ.2.61కోట్లు, సంగారెడ్డి జిల్లాలోని 17 కళాశాలలకు రూ.3.34 కోట్లు, మెదక్ జిల్లాలోని 14 కళాశాలలకు రూ.3.26 కోట్లు మంజూరు చేస్తూ ఇంటర్ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో జగదేవ్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అత్యధికంగా రూ.37.5 లక్షలు మంజూరు కాగా, అత్యల్పంగా మద్దూరు కళాశాలకు రూ.2.95 లక్షలు మంజూరయ్యాయి.

పదేళ్లుగా నిధులు లేవు



ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు గత పది సంవత్సరాలుగా నిధులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల భవనాలను దశాబ్దాల క్రితం నిర్మించగా, అవి మరమ్మతులకు నోచుకోలేదు. ముఖ్యంగా తాగునీటి సౌకర్యం లేకపోవడం, విద్యుత్ సరఫరా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పది సంవత్సరాలుగా నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినప్పటికీ నిధులు మంజూరు కాలేదు. తాజాగా, గత సంవత్సరం పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యుత్, తాగునీటి పనులకు మోక్షం

నిధుల మంజూరుతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సరఫరా, మరమ్మతులు, తాగునీటి సౌకర్యాల కల్పనకు మోక్షం లభించినట్లయింది. ఇక కళాశాలల్లో విద్యుత్ తీగల మరమ్మతులు, అన్ని తరగతి గదులలో విద్యుత్ సరఫరా వంటి పనులు చేపట్టనున్నారు. అలాగే, చాలా కళాశాలల్లో స్వచ్ఛమైన తాగునీరు లభించడం లేదు. కొన్ని కళాశాలల్లో దాతల సహకారంతో ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తున్నప్పటికీ, నిర్వహణ లేకపోవడంతో అవి కూడా నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం నిధులు మంజూరు కావడంతో స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి అవసరమైన పనులు చేపట్టనున్నారు. అలాగే, కళాశాలలోని ఇతర మరమ్మతులు కూడా చేయడానికి ఈ నిధులను వినియోగించనున్నారు.

న్యూస్ బాక్స్

మంత్రిని కలిసిన కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

తూప్రాన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జిగా నియామకమైన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి బాలకృష్ణ ప్రజాపతి బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కుమ్మరుల అభివృద్ధికి కృషి చేయాలని మంత్రిని కోరారు.

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కంగ్టి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ కోరారు. బుధవారం మండల కేంద్రమైన కంగ్టిలోని కేజీబీవీ, ఎస్టీ గురుకుల విద్యాలయంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు.

వసతి గృహానికి నీరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చిన్నశంకరంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల వసతి గృహంలో తాగునీటి సరఫరాకు అధికారులు చర్యలు చేపట్టారు. 'వసతి గృహంలో తాగునీటి కష్టాలు' అనే శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించారు. తాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రిన్సిపాల్ వాణి ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో మరో బోరు బావి నుంచి నీటిని సరఫరా చేసి వసతి గృహంలో నీటి ఎద్దడిని తీర్చారు.

బాల కార్మికులతో పని చేయిస్తున్న వ్యక్తిపై కేసు

శివ్వంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : బాల కార్మికులతో పనిచేస్తున్న ఇటుక బట్టి యజమానిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన కొత్తపేటలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొత్తపేట రూప్లతండాలో ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. కాగా తండాలోని ఇటుక బట్టీలో ఇద్దరు బాల కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తించిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కిషన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపారు.

విఠలేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవంలో భక్తులు

పెద్దశంకరంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢమాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం పెద్దశంకరంపేటలో విఠలేశ్వర స్వామి రథోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై రుక్మిణీవిఠలేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి పట్టణ పురవీధుల గుండా భక్తులు భజనలు చేస్తూ రథాన్ని లాగుతూ రథోత్సవం నిర్వహించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అమీన్‌పూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : వాటర్ ప్లాంట్‌ను అడ్డాగా చేసుకుని గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న వారిని అమీన్‌పూర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ విజయ్‌రావు వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని వాణినగర్‌లో సుధీర్‌రెడ్డి అనే వ్యక్తికి చెందిన వాటర్ ప్లాంట్ షెడ్డులో పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. వెళ్లి చూడగా వాటర్ ప్లాంట్ యజమాని సుధీర్ రెడ్డి, వెంకటేశ్, దిలీప్‌రెడ్డి, విజయ్‌కృష్ణ, అనిల్‌కుమార్ అనే నిందితులు పేకాట ఆడుతున్నారు. వారి నుంచి రూ.23,130 నగదు, 7 సెల్‌ఫోన్లు, ఓకారు, పల్సర్‌బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసిన రిమాండ్‌కు తరలించారు.

విద్యార్థులకు ఉచిత ఈఎన్‌టీ పరీక్షలు

రామచంద్రాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండలం కొల్లూరు ఎంపీపీఎస్, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆశ్రయ్ ఆకృతి సంస్థ బుధవారం కమ్యూనిటీ ఔట్రీచ్ సదస్సును నిర్వహించింది. చెవి, ముక్కు, నాలుక ఇతర వైకల్య స్క్రీనింగ్ నిర్వహించి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు ఉచిత మందులను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు దిలీప్ సింగ్, సుమాంజలి, డాక్టర్ శ్వేత, డాక్టర్ భార్గవ్, డాక్టర్ సౌమ్య, ఆశ్రయ్ ఆకృతి బృందం పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీటీసీ కన్నుమూత

కంగ్టి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఎన్కేమూరి మాజీ ఎంపీటీసీ సందీప్‌పాటిల్(36) బుధవారం మృతిచెందారు. రాంతీర్థ్ గ్రామానికి చెందిన సందీప్‌పాటిల్ కొన్నిరోజులుగా గుండె సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడు. కాగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు.

నాణ్యమైన విద్యనందించాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న రాహుల్‌రాజ్

హవేళిఘణపూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. బుధవారం మండలంలోని డైట్ కళాశాలలో ప్రాథమిక, ఉన్నతస్థాయి విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడం కోసం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉత్తమ విద్యాబోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, కోఆర్డినేటర్స్, ఎంఈవోలు,హెచ్ఎంలు పాల్గొన్నారు.

'ఇందిరా మహిళాశక్తి'లో ఉపాధి కల్పన

● మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ ● ఘనంగా విజయోత్సవాలు



విజయోత్సవాల్లో అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ అర్బన్/నర్సాపూర్/టేక్మాల్/సంగారెడ్డి రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా మహిళా శక్తి పథకంలో ఉపాధి కల్పనతోపాటు మహిళలు ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అనేక జీవనోపాధి కార్యకలాపాలను అమలు చేస్తుందని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్లో ఇందిరా మహిళా శక్తి విజయోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంబరాల ఆవశ్యకత, నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో యాదయ్య, అడల్ట్ ఎడ్యుకేషన్ జిల్లా అధికారి మురళీ, ఏపీఎం వెంకటస్వామి, టీఎంసీ మెప్మా సునీత, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు. నర్సాపూర్ మండలం నారాయణపూర్, లింగాపూర్‌లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అదనపు సీఈవో కాత్యాయని పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ అదనపు పీడీ సరస్వతి, ఎంపీడీవో మధులత, ఏపీఎం గౌరీశంకర్ పాల్గొన్నారు. మండల కేంద్రమైన టేక్మాల్ గాంధీభవనంలో టేక్మాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హర్షిత ఆధ్వర్యంలో మహిళాశక్తి సంబురాలు నిర్వహించారు. సంగారెడ్డి మండలం కల్పగూర్‌లో ఇందిరా మహిళాశక్తి సంబరాలు నిర్వహించారు.

స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలి

● ఎన్‌పీఆర్‌డీ జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న తుడుం రాజేందర్

సంగారెడ్డి క్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలని ఎన్‌పీఆర్‌డీ జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్ డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్‌డీ (నేషనల్ ప్లాట్‌ఫామ్ ఫర్ ది రైట్స్ ఆఫ్ ద డిసేబుల్డ్) ఇండియా సంగారెడ్డి జిల్లా నూతన కమిటీ ఎన్నిక సంగారెడ్డిలో బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా ఎం.మహేశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మన్నె పోచయ్య, ఉపాధ్యక్షుడిగా ఎస్.వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా అంధిపురం మహేష్, జాయింట్ సెక్రటరీగా చాకలి నర్సింలు, జాయింట్ సెక్రెటరీగా శివ రాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డేవిడ్, అధ్యక్షురాలిగా జీ.ప్రవీణ, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడిగా నవీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తుడుం రాజేందర్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో దివ్యాంగుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, పాలన వ్యవస్థల్లో ప్రాతినిధ్యం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు దైనంపల్లి మల్లికార్జున, దివ్యాంగుల ప్రాతినిధ్య సాధన కమిటీ రాష్ట్ర చైర్మన్ షఫి అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై నిగ్గు తేల్చాల్సిందే

● అధికారులపై గోవిందాపూర్ గ్రామస్థుల ఆగ్రహం



అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు

జహీరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గోవిందాపూర్ గ్రామంలో పంచాయతీ నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ అధికారులను గ్రామస్థులు నిలదీశారు. బుధవారం గ్రామంలో ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సరస్వతీ, పలువురు అధికారులు, గ్రామస్థుల సమక్షంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు సర్పంచుల పదవీకాలం ముగిసిన సమయంలో ఎన్ని నిధులున్నాయి.. ఇప్పటివరకు ట్యాక్సులు తదితరాలు కలిపి ఎన్ని నిధులు జమ ఉన్నాయని అధికారులను ప్రశ్నించారు. నిధులుక దుర్వినియోగం చేశారని గ్రామసభలో వారంతా ఆరోపించారు. ఈ విషయమై గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి స్పందిస్తూ నిధుల దుర్వినియోగం జరగలేదని, ఆరోపణల్లో వాస్తవం లేదని, పనులకు, నిధులకు సరిపడా లెక్కలున్నాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ తాజొద్దీన్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బస్తీల్లో అభివృద్ధి పనులకు నిధులు



ఇక్రిశాట్ బస్తీలో సీసీరోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

రామచంద్రాపురం టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : బస్తీలు అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరవుతున్నాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం భారతీనగర్ డివిజన్ పరిధి ఇక్రిశాట్ ఫెన్సింగ్ ఏరియాలో రూ.1.26 కోట్లతో సీసీరోడ్డు, మురుగు పైపులైన్, ప్రహరీ నిర్మాణ పనులు కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధి పనులు ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్నామని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారిని గుర్తించి అందజేస్తామని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

● కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్



లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న నీలం మధు

పటాన్‌చెరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ అన్నారు. మంగళవారం గుమ్మడిదల, కానుకుంట, అన్నారం, రుద్రారంకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేసిందన్నారు. మెరుగైన వైద్య సేవల కోసం కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించే పేదలకు ప్రభుత్వం తనవంతు సహకారం అందిస్తుందని చెప్పారు.

ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదు



మద్దీ వీరారెడ్డి

గుమ్మడిదల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు మద్దీ వీరారెడ్డి అన్నారు. బుధవారం గుమ్మడిదలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు పక్కనే ఉన్న జిన్నారం సర్వే నంబరు ఒకటి, జంగంపేట రైతులకు న్యాయం చేయని దద్దమ్మలు కొడంగల్ గుమ్మడిదలకు లింకు పెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలోనే రైతులకు న్యాయం జరుగుతుందని ఆయన దీమా వ్యక్తం చేశారు.

ప్రహరీ నిర్మాణానికి రూ.30 లక్షలు

శివ్వంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిల్లుట్లలో గల పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరైనట్లు గ్రామస్థులు బొమ్మిడాల శంకర్, బుర్ర మురళీ గౌడ్ తెలిపారు. పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన రూ.30 లక్షల నిధులు మంజూరు చేయడంతో పనులు వేగంగా జరుగుతున్నాయి.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

● ఎస్పీకి పద్మారెడ్డి ఫిర్యాదు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న పద్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రెండురోజుల క్రితం ఓ న్యూస్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం మెదక్ ఎస్పీ శ్రీనివాస్‌రావుకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జితేందర్‌గౌడ్, ఆంజనేయులు, గడ్డమీది కృష్ణాగౌడ్, వంజరి జయరాజ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి మొక్కనూ సంరక్షించాలి

అల్లాదుర్గం/చిన్నశంకరంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. వనమహోత్సవంలో భాగంగా బుధవారం మండలంలోని ముప్పారం గ్రామంలో మొక్కలను నాటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో సుధాకర్, ఎంపీవో లింగప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి పాల్గొన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లి, కామారం తదితర గ్రామాలను ఎంపీడీవో దామోదర్ సందర్శించి, వన నర్సరీలో మొక్కలను పరిశీలించారు. అనంతరం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి చేయూత

సదాశివపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అనారోగ్యంతో మృతిచెందిన ఫొటో గ్రాఫర్ రవి కుటుంబానికి సదాశివపేట ఫొటో, వీడియో గ్రాఫర్స్ యూనియన్ అండగా నిలిచింది. యూనియన్ అధ్యక్షుడు నాగుల విజయ్‌కుమార్ బుధవారం మృతుడి కుటుంబసభ్యులకు రూ.1.60 లక్షల చెక్కును అందజేశారు.

లోక్ అదాలత్‌లో సమస్యలు పరిష్కారం



మొక్క నాటుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

పుల్‌కల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : చిన్న చిన్న భూ తగదాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి బీ.సౌజన్య సూచించారు. చౌటకూర్ మండలం కోర్పోల్ గ్రామంలో బుధవారం పౌరులకు న్యాయ సేవలపైరైతువేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నచిన్న గొడవలకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం వల్ల ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతుంటారన్నారు. ఆ సమస్యల పరిష్కారం కోసం లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఏవో ప్రవీణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్, పంచాయతీ కార్యదర్శి మల్లేశం, ఏఈవోలు ప్రవీణ్, దత్తు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె పూర్తిగా విఫలం

● బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తోట నరసింహారెడ్డి

సంగారెడ్డి అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా బుధవారం జరిగిన సార్వత్రిక సమ్మె పూర్తిగా విఫలమైందని బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తోట నరసింహారెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. జిల్లాలో భారీ మధ్య, చిన్న తరహా పరిశ్రమల్లో అన్ని ఉత్పత్తులు సాగించాయని, ముఖ్యంగా కమ్యూనిస్టు యూనియన్ ఉన్న కంపెనీలు నడిచాయని ఆరోపించారు. రాజకీయంగా బీజేపీని ఎదుర్కోలేక దొంగచాటుగా కార్మికులతోనే మనువాద రాజకీయాలు చేస్తూ కులమతాలవారీగా కార్మికులను విడదీసి శునక ఆనందం పొందుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం 282 జీవో ఇస్తే దానికి కేంద్ర ప్రభుత్వానికి ఏం సంబంధమని నిలదీశారు.



పుల్‌కల్ : శివంపేటలో జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న కార్మికులు

సార్వత్రిక సమ్మె విజయవంతం

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో విజయవంతమైంది. ఇందులో భాగంగా పలు మండలాల్లో నాయకులు ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు నిర్వహించారు. కార్మికులకు వ్యతిరేకంగా 8 గంటల పనిదినాన్ని 10 గంటలకు పెంచుతూ తీసుకొచ్చిన జీవో 282ను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

- న్యూస్ నెట్‌వర్క్



శివ్వంపేటలో ధర్నా చేస్తున్న కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు

రాజీవ్ గృహకలత

(5వ పేజీ తరువాయి)

భావించి, ఆర్థిక స్థోమత లేకున్నా ఉన్న కొద్దిపాటి బంగారాన్ని కుదవ పెట్టి, అప్పులు చేసి కిస్తీలు కట్టిన లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. గత 16 సంవత్సరాలుగా తమకు ఎప్పటికైనా ఇళ్లు వస్తాయనే ఆశతో ఎదురు చూస్తున్నామని వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఈ ఇళ్లను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. రాజీవ్ గృహకల్ప ఇళ్లను పంపిణీ చేస్తే కాంగ్రెస్ పార్టీకి పేరొస్తుందని భావించారో ఏమో కాని వాటిని పూర్తి చేయలేదు. ఇప్పుడు తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున తమకు ఇళ్లను ఇచ్చి ఆదుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇప్పుడు తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి రావడంతో తమకు న్యాయం జరుగుతుందని, తమ ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి అప్పగించాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు



కాంగ్రెస్ వారు కట్టారనే బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించింది కాబట్టి కనీసం ఇప్పుడైనా మాకు రాజీవ్ గృహకల్ప ఇళ్లను పూర్తి చేయాలి. మా సొంతింటి కలను తీర్చాలి.

- నర్సింలు, సంగారెడ్డి

అప్పు పెరుగుతూనే ఉంది



ఇంటి కోసం తీసుకున్న అప్పు ఇప్పటి వరకు పెరుగుతూనే ఉంది. ఇంకా వస్తుందేమోనని ఆశగా ఎదురుచూస్తున్నాం. అద్దె కట్టలేక అవస్థలు పడుతున్నం. రాజీవ్‌గృహకల్పలో మా ఇళ్లు మాకివ్వాలి.

- ఖతీజాబేగం, సంగారెడ్డి

రసీదు వెయ్యికి.. వసూలు లక్షల్లో

(5వ పేజీ తరువాయి)

తేల్చారు. చిన్న దుకాణాల నుంచి పెద్ద హోటళ్లు, షాపింగ్ మాల్స్ ఇతర వ్యాపార సముదాయాలు భారీగా ఉన్న ఈ ప్రాంతంలో, రోడ్ల రకాన్ని బట్టి అడుగుకు నాలుగు నుంచి ఎనిమిది రూపాయల వరకు ఫీజు వసూలు చేయాలి. అయితే, నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండానే పెద్ద ఎత్తున వ్యాపారాలు సాగుతున్నట్లు బయటపడుతోంది. ట్రేడ్ లైసెన్స్ పొందాలంటే, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆయన క్షేత్రస్థాయి విచారణ జరిపి కమిషనర్‌కు నివేదించిన తర్వాతే, డిజిటల్ సంతకంతో కూడిన ఫీజు రశీదు, అనుమతి పత్రం జారీ అవుతుంది. కానీ చాలాచోట్ల ఈ ప్రక్రియను పక్కన పెట్టి, కేవలం ప్రాథమిక రశీదుతోనే వ్యాపారాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొల్లూరు అవుటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని, అలాగే కొత్తగా కలిసిన ముత్తంగి గ్రామం జాతీయ రహదారులకు ఆనుకొని ఉన్న ప్రాంతాల్లోని వ్యాపార సముదాయాలకు భారీగా అక్రమ అనుమతులు ఇచ్చినట్లు సమాచారం.

విచారణ ప్రారంభం.. బాధితుల ఫిర్యాదులు

వెయ్యికిపైగా అనుమతుల వ్యవహారంపై అధికారులు విస్తృత విచారణ జరుపుతున్నారు. డిజిటల్ సంతకం లేని దాదాపు అందరు వ్యాపారులకు నోటీసులు జారీ చేయడానికి సన్నద్ధమవుతున్నారు. నాలుగు రోజులుగా ఈ గుర్తింపు ప్రక్రియ జరుగుతోంది. వ్యాపారుల వద్ద ప్రాథమిక రశీదులు, డిజిటల్ సంతకంతో కూడిన అనుమతి పత్రాలు ఉన్నాయా లేదా అనేవి పరిశీలిస్తున్నారు. ఇటీవల కర్దనూరు గ్రామంలో ఒక చిన్న దుకాణానికి రూ.వెయ్యి రశీదు ఇచ్చి, రూ.26 వేలు అదనంగా వసూలు చేశారని ఒక బాధితుడు అధికారులకు ఫిర్యాదు చేయడం ఈ అక్రమాలకు నిదర్శనం. మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్న ఈ అక్రమాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ విచారణ ఎంతవరకు వెళ్తుంది, ఎంత మంది అక్రమార్కుల బండారం బయటపడుతుంది అనేది వేచి చూడాలి.

'పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి'

కంది, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన న్యూ పెన్షన్ స్కీమ్‌ను రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో బుధవారం ఐఎన్‌టీయూసీ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల్లో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగ నియామకాలు చేపట్టడం సరికాదన్నారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులకు వర్క్‌లోడ్ పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావాల్సిన ప్రమోషన్ సకాలంలో ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు జనార్ధన్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, ఎం.లక్ష్మయ్య పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటా

కంది, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థుకు అండగా ఉంటానని పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కంది మండలంలోని చెర్లగూడెంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆయన సొంత ఖర్చుతో బ్యాగులు, స్టడీ కిట్లు పంపిణీ చేశారు. అలాగే పాఠశాల బీరువాలు, కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో జగప్ప, ఉపాధ్యాయులు ఆయనను, గ్రామ పెద్దలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, కార్యదర్శి వందన, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చౌటకూర్ తహసీల్దార్‌గా అనుదీప్

పుల్‌కల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండల తహసీల్దార్‌గా మళ్లీ అనుదీప్ నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ ప్రావీణ్య బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. డీటీసీఎస్ నయాబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అనుదీప్ ఏప్రిల్‌లో చౌటకూర్ తహసీల్దార్‌గా నియమిస్తూ అప్పటి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉత్తర్వులు జారీచేయగా బాధ్యతలు స్వీకరించి, నెలరోజులు పనిచేశారు. తదనంతరం అందోలు-జోగిపేట రెవెన్యూ డివిజనల్ పరిపాలన అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.సంధ్యారాణిని చౌటకూర్ తహసీల్దార్‌గా నియమించారు. అప్పటివరకు తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న అనుదీప్‌ను అక్కడే నయాబ్ తహసీల్దార్‌గా కొనసాగించారు. తాజాగా సంధ్యారాణిని అందోలు-జోగిపేట రెవెన్యూ డివిజనల్ పరిపాలన అధికారిగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు. నెలరోజుల పాటు తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన సంధ్యారాణి ఉన్నట్టుండి బదిలీ కావడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

ఎమ్మెల్యే చొరవతో విద్యార్థులకు బస్సు సౌకర్యం

జిన్నారం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల, కళాశాలకు నడుచుకుంటూ వెళ్లే విద్యార్థులు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చొరవతో పరిశ్రమ యాజమాన్యం బస్సు సౌకర్యం కల్పించింది. ఊట్ల, దాదిగూడెం గ్రామాల పరిధిలోని విద్యార్థులు జిన్నారంలో గల ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలకు నిత్యం మూడు కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్తున్నారు. స్థానికులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. న్యూలాండ్ యాజమాన్యంతో చర్చించి, విద్యార్థుల కోసం బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయించినట్లు మాజీ సర్పంచ్ ఆంజనేయులు తెలిపారు.

ముగిసిన ఎస్ఏ టీచర్ల ధ్రువపత్రాల పరిశీలన

సంగారెడ్డి అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల పదోన్నతుల్లో భాగంగా రెండురోజులుగా నిర్వహించిన సర్టిఫికేట్ వెరిఫికేషన్ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో 234 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు తమ ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేయించుకున్నారు. జాబితాలో పేర్లు లేని వారిని జాబితాలో చేర్చుకునే అవకాశం కల్పించడంతో పలువురు ఉపాధ్యాయులు జాబితాలో వివరాలు నమోదు చేసుకున్నారు. ఇలా ఉండగా మల్టీజోన్-2 పరిధిలో స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించనున్న నేపథ్యంలో తుది జాబితాను రూపొందించడంలో విద్యాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు.